## క్లుప్తంగా

### బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు పోస్తే చర్యలు



జరిమానా విధిస్తున్న అధికారులు

సూర్యాపేట రూరల్ : బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలను పోస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ రామానుజులరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన సూర్యాపేటలో మాట్లాడారు. బహిరంగ ప్రదేశాల్లో మలమూత్ర వ్యర్థాలను రోడ్డు పక్కన పోసినందుకు గాను దుర్గా సెప్టిక్ ట్యాంకు ఓనర్‌కి రూ.15000ల పెనాల్టీ విధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సురేష్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ శివప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ సతీష్ పాల్గొన్నారు.

### సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

తిరుమలగిరి : సైబర్ నేరాల నియంత్రణపై పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం తిరుమలగిరిలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ జగన్మోహన్‌రెడ్డి మాట్లాడారు. అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్ ఎత్తొద్దని, బ్యాంకు సమాచారం, ఓటీపీ నంబర్లు అడిగితే ఎవ్వరూ చెప్పవద్దని సూచించారు. కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీస్ శాఖ వారికి సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ పిళ్లై రవీందర్, సైదులు, వెంకన్న, రమేష్ పాల్గొన్నారు.

### కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న నాయకులు

పెన్‌పహాడ్ : ప్రభుత్వం ఆసరా పింఛన్లు రూ.3016 నుంచి రూ.4016లకు పెంచడంపై హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం దోసపహాడ్‌లో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దొంగరి యుగేందర్ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్, మంత్రి జగదీష్‌రెడ్డిల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొండేటి రాంబాబు, మేకల శ్రీను, పందిరి సైదులు, వల్లపట్ల వీరస్వామి, లింగమ్మ, వీరయ్య, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

### నష్టపరిహారం చెల్లించాలి

నాగారం : రాష్ట్ర వ్యాప్తంగా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం మండల కార్యదర్శి కడియం కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వర్షాలకు పంటలు పూర్తిగా దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. ప్రభుత్వం నష్టపరిహారం చెల్లిస్తామని చెప్పి నెల రోజులు గుడుస్తున్నా నేటికీ ఇవ్వలేదన్నారు. ప్రభుత్వం ఎకరాకు రూ.10వేల చొప్పున పంట నష్టపరిహారం చెల్లించాలని కోరారు. ఆయనతో సీపీఎం నాయకులు కండె భిక్షం, పుల్లయ్య, వెంకటేశ్వర్లు, పద్మ, స్వరూప, రాములు, మహేందర్, అంజయ్య, మంజుల, పిచ్చయ్య, రాములమ్మ, వెంకన్న తదితరులు ఉన్నారు.

### సెప్టెంబర్ 1నుంచి నిరసనలు



మాట్లాడుతున్న కొలిశెట్టి యాదగిరిరావు

అర్వపల్లి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఖండిస్తూ వచ్చే నెల 1 నుంచి 7వరకు నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు తెలిపారు. శుక్రవారం అర్వపల్లిలో జరిగిన సీపీఎం నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. నిత్యావసరాల ధరలను ప్రభుత్వాలు అదుపు చేయకపోవడం వల్ల సామాన్య ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో చెరకు యాకలక్ష్మి, బుర్ర శ్రీనివాస్, కందాళ శంకర్‌రెడ్డి, పులుసు సత్యం, మండల కార్యదర్శులు వజ్జె శ్రీనివాస్, కుమార్, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా తీజ్ పండుగ

తిరుమలగిరి : ఈదులపర్రె తండాలో తీజ్ పండుగను శుక్రవారం గిరిజనులు ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో లంబాడీ ఐక్య వేదిక సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు పరమేష్‌నాయక్, కుమార్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.



తీజ్ వేడుకల్లో పాల్గొన్న గిరిజనులు

# మున్సిపాలిటీకి నిధుల వరద

- తిరుమలగిరి మున్సిపాలిటీకి రూ.35 కోట్లు విడుదల
- అమృత్ పథకంలో భాగంగా మరో రూ.30 కోట్లు మంజూరు
- ముమ్మరంగా కొనసాగుతున్న అభివృద్ధి పనులు



తిరుమలగిరిలో కొనసాగుతున్న మున్సిపాలిటీ భవన నిర్మాణం పనులు

తిరుమలగిరి : ఉమ్మడి రాష్ట్రంలో సదుపాయాల లేమితో కొట్టుమిట్టాడిన మున్సిపాలిటీలు ప్రస్తుతం అభివృద్ధికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీల అభివృద్ధికి అధికంగా నిధులు కేటాయించడంతో అభివృద్ధి పథంలో దూసుకెళ్తున్నాయి. తిరుమలగిరి మున్సిపాలిటీకి నిధుల వరద పారుతున్నది. తిరుమలగిరిలో గత నెల 29న జరిగిన తుంగతుర్తి ప్రగతి నివేదిక బహిరంగ సభలో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.10 కోట్లు ప్రకటించారు. అలాగే ఈ నెల 20వ తేదీన సూర్యాపేటలో జరిగిన బహిరంగ సభలో సీఎం జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలకు రూ.25 కోట్లు కేటాయించగా అందులో భాగంగా తిరుమలగిరి మున్సిపాలిటీకి రూ.25 కోట్లు ప్రకటించబడ్డాయి. మొత్తం రూ.35 కోట్లకు సంబంధించి ప్రభుత్వం ఇటీవలే జీఓ విడుదల చేసింది.

**మున్సిపల్ పరిధిలో పనులు..**

తిరుమలగిరి మున్సిపాలిటీ 2018, ఆగస్టు 2వ తేదీన తిరుమలగిరి, మాలిపురం, నందాపురం, అనంతారం గ్రామాలు కలిసి నూతన మున్సిపాలిటీగా 15 వార్డులతో ఏర్పడింది. 2018 అసెంబ్లీ ఎన్నికలకు ముందు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి తిరుమలగిరి మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.20 కోట్లు ప్రకటించారు. ఆ నిధుల్లో భాగంగా తిరుమలగిరి మున్సిపాలిటీ బిల్డింగ్‌కు రూ.5 కోట్లతో పనులు సాగుతున్నాయి. రూ.12 కోట్లతో మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో సైడ్ డ్రైన్‌లు వేయడానికి టెండర్లు పూర్తయ్యాయి. రూ.3 కోట్లతో సీసీ రోడ్లు, రూ.2 కోట్లతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ గత నెల 29న శంకుస్థాపన చేశారు. అలాగే మున్సిపాలిటీలో తాగునీటి సమస్య, అంతర్గత పైపు లైన్ల నిర్మాణానికి అమృత్ పథకంలో భాగంగా రూ.30 కోట్ల నిధులు మంజూరయ్యాయి.

**మున్సిపాలిటీల అభివృద్ధికి కృషి**



జనాభా ప్రాతిపదికన ప్రభుత్వం కొత్త మున్సిపాలిటీల లో మౌలిక సదుపాయాల కల్పనకు సమృద్ధిగా నిధులు కేటాయిస్తోంది. సంవత్సరాలుగా సమస్యలతో ఉన్న పట్టణాలు అభివృద్ధి పథంలో ముందుకు వెళ్లనున్నాయి.

\- గాదరి కిషోర్‌కుమార్, ఎమ్మెల్యే

**పనులు జరుగుతున్నాయి**

తిరుమలగిరి మున్సిపాలిటీలో రూ.5 కోట్లతో మున్సిపాలిటీ భవన నిర్మాణం, రూ.3 కోట్లతో సీసీ రోడ్డు నిర్మాణం పనులు కొనసాగుతున్నాయి. రూ.12 కోట్లతో అండర్ డ్రెయినేజీ నిర్మాణాలకు టెండర్లు పూర్తయ్యాయి. త్వరలోనే పనులు ప్రారంభమవుతాయి.

\- దండు శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్, తిరుమలగిరి

## గ్రామీణ క్రీడల ఆదరణకు కృషి



చీరలను పంపిణీ చేస్తున్న సునీత

ఆత్మకూర్ (ఎస్) : గ్రామీణ క్రీడల ఆదరణకు తమ వంతు కృషి చేస్తున్నట్లు ఎస్ ఫౌండేషన్ చైర్మన్, మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి సతీమణి సునీత తెలిపారు. శుక్రవారం కోటినాయక్‌తండా, దుబ్బ తండా, పాత సూర్యాపేట, ఏనుబాముల, ఆత్మకూర్ (ఎస్), నెమ్మికల్, కందగట్ల, గట్టికల్, పీపా నాయక్‌తండా, బోరింగ్ తండా, పాతర్లపహాడ్, ఇస్తాళాపురం, ముక్కుడు దేవులపల్లి, రామన్నగూడెం గ్రామాల్లో ఇటీవల నిర్వహించిన క్రీడాపోటీల్లో కోలాటం ఆడిన మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కోలాటాలతో పాటు యువత క్రీడల్లో రాణించేందుకు మంత్రి జగదీష్ రెడ్డి సొంత ఖర్చులతో పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తూడి నరసింహారావు, ఎంపీపీ మర్ల స్వర్ణలత చంద్రారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ కొణతం సత్యనారాయణరెడ్డి, బత్తుల ప్రసాద్, బ్రహ్మం గౌడ్, సుధీర్ రెడ్డి, కౌశిక్ రెడ్డి, కరుణశ్రీ, విజయ, కల్లేపల్లి మహేశ్వరి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## బీపీ మండల్ ఆశయ సాధనకు కృషి చేయాలి



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

భానుపురి : బీపీ మండల్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని శ్రీకృష్ణ ట్రస్ట్ చైర్మన్, ప్రముఖ డాక్టర్ రామ్మూర్తి యాదవ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని జ్యోతిరావు పూలే విగ్రహం ఎదుట బీపీ మండల్ 105వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండల్ పోరాటంతోనే బీసీలకు రిజర్వేషన్ల అవకాశం దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం రాష్ట్ర నాయకులు పోలబోయిన నర్సయ్య యాదవ్, మాండ్ర మల్లయ్య యాదవ్, తోట శ్రీనివాస్ యాదవ్, వెలగబోయిన మధు, సుంకరబోయిన వెంకన్న, వీరబోయిన లింగయ్య, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు శ్రీరాములు, లచ్చిరాం నాయక్, ఎడ్ల వెంకన్న, భిక్షపతి, సుంకరబోయిన రాజు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ పథకాలు దేశానికే ఆదర్శం



తుంగతుర్తిలో లబ్ధిదారులకు పెంఛన్ ప్రొసీడింగ్స్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కిషోర్‌కుమార్

తుంగతుర్తి : అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ అన్నారు. శుక్రవారం నియోజకవర్గ కేంద్రంలో తుంగతుర్తి, మద్దిరాల, నూతనకల్ మండలాలకు చెందిన దివ్యాంగులకు జెడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపిక యుగంధర్‌రావుతో కలిసి ఆసరా పింఛన్ల ప్రొసీడింగ్ కాపీలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా దివ్యాంగులకు నెలకు రూ.4016 అందజేస్తున్న ఘనత కేసీఆర్‌దే అన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ కిరణ్‌కుమార్, తహసీల్దార్ యాదగిరిరెడ్డి, ఎంపీడీఓ భీంసింగ్, జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు ఎస్‌ఏ రజాక్, ఎంపీపీ గుండగాని కవితరాములుగౌడ్, డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, వికలాంగుల రాష్ట్ర నాయకులు మల్లారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య, దివ్యాంగుల సంఘం నాయకులు నేండ్ర మల్లారెడ్డి పాల్గొన్నారు.

**రాష్ట్రంలో విద్యకు అధిక ప్రాధాన్యం**

రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే కిషోర్‌కుమార్ అన్నారు. శుక్రవారం వెలుగుపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో మన ఊరు–మనబడి పథకంలో భాగంగా రూ.58లక్షల వ్యయంతో చేపట్టే అభివృద్ధి పనులకు జెడ్పీచైర్‌పర్సన్ గుజ్జ దీపిక యుగంధర్‌రావుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ఊరు–మనబడితో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోయాయన్నారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్‌ఏ రజాక్, ఎంపీపీ గుండగాని కవితరాములుగౌడ్, డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, వైస్ఎంపీపీ మట్టపల్లి శ్రీశైలం, ఎంఈఓ బోయిని లింగయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య, సర్పంచ్ మామిడి వెంకన్న, ఎంపీటీసీ మట్టపల్లి కవిత, దొంగరి శ్రీను, పులుసు యాదగిరి పాల్గొన్నారు.



తుంగతుర్తి : మన ఊరు-మనబడి పనులకు శంకుస్థాపన చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే

**ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిక**

అర్వపల్లి : పర్సాయపల్లిలో వివిధ పార్టీల నాయకులు శుక్రవారం ఎమ్మెల్యే కిషోర్‌కుమార్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారిలో వార్డు సభ్యుడు బానోతు సైదులు, కీర్తి చిట్టిబాబు, ఎస్‌కె. జాని, ఎస్‌కె. మైబు, హుస్సేన్, ఇక్బాల్, దండ వెంకట్‌రెడ్డి, మిడతపల్లి ముత్తయ్య, మర్యాద జోగయ్య, బానోతు నర్సింహ, నర్సయ్య, సైదులు, ఎస్.వీరయ్య, మల్లయ్య, సైదులు, కె.ప్రవీణ్, ఎస్.లచ్చయ్య, యల్లమ్మ, ప్రవీణ్, డాక్టర్ తిరుపతయ్య, రాజు, సైదమ్మ, పంది విజయ రామరాజు తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గుండగాని సోమేష్‌గౌడ్, జిల్లా నాయకుడు మన్నె లక్ష్మీనర్సయ్యయాదవ్, కె.భరత్‌రెడ్డి, కోఆర్డినేటర్ పి.ఎర్రనర్సయ్య, పందిరి యుగంధర్, రాచకొండ సురేష్, మిర్యాల వెంకన్న, సర్పంచ్ పుప్పాల శేఖర్, కె.వెంకన్న, అర్జున్ పాల్గొన్నారు.

**ఎమ్మెల్యేను కలిసిన బీఆర్ఎస్ నాయకులు**

తిరుమలగిరి : ఎమ్మెల్యే కిషోర్‌కుమార్‌కు బీఆర్ఎస్ తరఫున మూడవసారి టికెట్ కేటాయించడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఆ పార్టీ నాయకులు శుక్రవారం ఎమ్మెల్యేను కలిసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో 7వ వార్డు కౌన్సిలర్ కేశిడి సరళాయాదవరెడ్డి, అధ్యక్షుడు రాజమల్లు, వెంకట్‌రెడ్డి, సంజీవరెడ్డి, నాగరాజు, సురేష్, నగేష్, సత్యం పాల్గొన్నారు.

**నేడు ఆసరా పింఛన్ల ప్రొసీడింగ్స్ పంపిణీ**

నాగారం : మండలంలోని ఆసరా పింఛన్ల లబ్ధిదారులకు నేడు తిరుమలగిరిలోని శుభమస్తు ఫంక్షన్ హాల్‌లో మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి, ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్‌ల చేతుల మీదుగా ఆసరా పింఛన్ల ప్రొసీడింగ్స్‌ను పంపిణీ చేయనున్నట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కల్లెట్లపల్లి ఉప్పలయ్య తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆయనతో పాటు బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.



అర్వపల్లి : పర్సాయపల్లిలో బీఆర్ఎస్‌లో చేరిన నాయకులతో ఎమ్మెల్యే కిషోర్‌కుమార్



తిరుమలగిరిలో ఎమ్మెల్యేను సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## సంక్షిప్త సమాచారం

**'కుల అహంకారం సరికాదు'**

భానుపురి : బీసీ సామాజిక వర్గానికి చెందిన కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్‌కు రెండోసారి ఎమ్మెల్యే అభ్యర్థిగా బీఆర్ఎస్ అవకాశం కల్పిస్తే కొందరు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నాయకులు కుల అహంకారాన్ని ప్రదర్శిస్తున్నారని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తన్నీరు రాంప్రభు అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బొల్లం మల్లయ్యయాదవ్ కోదాడ నియోజకవర్గంలో అన్ని వర్గాలను కలుపుకుంటూ నియోజవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. దీన్ని జీర్ణించుకోలేక కొందరు అసత్య ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. ఈ విషయంలో మంత్రి జగదీష్‌రెడ్డి జోక్యం చేసుకొని అసమ్మతి నేతలతో చర్చించి న్యాయం చేయాలని కోరారు.

**నేడు, రేపు ఓటరు నమోదు శిబిరాలు**

అర్వపల్లి : శని, ఆదివారాల్లో ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మండల వ్యాప్తంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో బీఎల్ఓలు అందుబాటులో ఉంటారని చెప్పారు. ప్రస్తుతం 18 ఏళ్లు నిండిన వారు, అలాగే అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండే వారు కూడా కొత్తగా ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అలాగే ఓటున్న ప్రతి ఒక్కరు ఓటరు జాబితాలో తమ ఓటు ఉందా లేదా అనే విషయమై పరిశీలించుకోవాలని కోరారు.

**27 నుంచి ఉర్సు**

నాగారం : ఈటూరులో ఈ నెల 27, 28 తేదీల్లో హజ్రత్ సయ్యద్ షా జలాల్ బుఖారి దర్గా ఉర్సు నిర్వహిస్తున్నట్లు దర్గా నిర్వహణ కమిటీ సభ్యుడు సయ్యద్ మఖ్సూద్ అహ్మద్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 27న గంధం ఊరేగింపు, 28న దీపారాధన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

**కాంగ్రెస్ కమిటీ ఎన్నిక**

నాగారం : శాంతినగర్‌లో కాంగ్రెస్‌పార్టీ గ్రామకమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నా రు. నూతన అధ్యక్షుడిగా పాదిల లింగయ్య, ఉపాధ్యక్షుడిగా షేక్.హుస్సేన్, ప్రధాన కార్యదర్శిగా గద్దల యాదగిరి, కార్యదర్శిగా షేక్.నాగుల్‌మీరా, కార్య నిర్వహణ సభ్యుడిగా ఎస్‌కె. జాన్, కోశాధికారిగా పాదిల వెంకన్న, కార్యవర్గ సభ్యులుగా షేక్ కరీం, షేక్.సైదులు, జెరిపోతుల అబ్బులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు తొడుసు లింగయ్య, ఎస్‌కె.వలీ, సైదులు, హుస్సేన్, అక్బర్‌పాషా పాల్గొన్నారు.

**ఫ్యాన్ బహూకరణ**

నూతనకల్ : మండల కేంద్రంలోని అంబేద్కర్ నగర్‌లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రానికి మండల కేంద్రానికి చెందిన కూరగాయల వ్యాపారి నకిరేకంటి చిరంజీవి–రేణుక దంపతులు శుక్రవారం సీలింగ్ ఫ్యాన్‌ను బహూకరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సరిత, కమలమ్మ పాల్గొన్నారు.

**పార్టీ బలోపేతానికి కృషి చేయాలి**

నూతనకల్ : కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి విద్యార్థి సంఘం నాయకులు కృషి చేయాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నాగం సుధాకర్‌రెడ్డి కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన ఎన్ఎస్‌యూఐ సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. ఎన్ఎస్‌యూ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా ఉప్పుల మురళీయాదవ్, ఉపాధ్యక్షుడిగా నకిరేకంటి ఉపేందర్, ప్రధాన కార్యదర్శిగా సానబోయిన సాగర్, కోశాధికారిగా నకిరేకంటి మహేష్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నకిరేకంటి అశోక్ బొడ్డుపల్లి అంజయ్య, బంటు బద్రి, నెల్లుట్ల మహేష్, బండపల్లి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా వరలక్ష్మీవ్రత పూజలు



భానుపురి : సంతోషిమాత ఆలయంలో శ్రావణమాసం పూజలకు హాజరైన భక్తులు



భానుపురి : వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



భానుపురి : 47వ వార్డులోని మహాలక్ష్మి ఆలయంలో వ్రతాలు చేస్తున్న మహిళలు

భానుపురి : శ్రావణ రెండవ శుక్రవారం పురస్కరించుకొని శ్రీసంతోషిమాత ఆలయంలో భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయ ప్రధాన అర్చకుడు ఇరువంటి శివరామకృష్ణ శర్మ తెల్లవారుజామునే సంతోషిమాతకు ప్రత్యేక అభిషేకం చేశారు. భక్తులు సమర్పించిన పట్టు వస్త్రాలు అమ్మవారికి అలంకరించి కుంకుమార్చనలు, శ్రీచక్రం, ప్రత్యేక పూజలు చేశారు. ఉద్యాపన వ్రతం చేసి అమ్మవారికి వడిబియ్యం పోశారు. శ్రావణమాసం రెండవ శుక్రవారం కావడంతో వరలక్ష్మీవ్రతాలు నిర్వహించారు. మహిళలు గోపూజలో పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక ఉయాలలో పవళింపు సేవా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ అధ్యక్ష, కార్యదర్శులు నూక వెంకటేశం గుప్త, బ్రహ్మాండ్లపల్లి మురళీధర్, కోశాధికారి పాలవరపు రాంమూర్తి, అన్నదాన నిర్వాహకులు కొత్త మల్లికార్జున్, దేవరశెట్టి సోమయ్య, యామా వెంకటేశ్వర్లు, సోమ శ్రీశైలం, పబ్బా ప్రకాష్, బ్రాహ్మణపల్లి బ్రహ్మయ్య, నామిరెడ్డి పాపిరెడ్డి, బెలిదే అశోక్ పాల్గొన్నారు.

**వేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు**

పట్టణంలోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ప్రతి సంవత్సరం నిర్వహించే వార్షిక పవిత్రోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలాచార్యులు స్వామివారికి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. తదనంతరం ఆలయ మండపంలో ఏర్పాటు చేసిన యాగశాలలో విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, అంకురార్పణ, అగ్నిప్రతిష్ఠ జరిపి మూలమంత్రాలతో హోమాలు చేశారు. మధ్యాహ్నం నిత్య పూర్ణాహుతి నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. వరలక్ష్మీ వ్రతం కావడంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది. కార్యక్రమంలో ఆలయ అర్చకులు శ్రీహరి ఆచార్యులు, సంకర్షణాచార్యులు, ఫణికుమార్ ఆచార్యులు, సంతోష్ ఆచార్యులు, వికాస తరంగిణి, ఆండాళ్ గోష్ఠి సభ్యులు పాల్గొన్నారు.

**శ్రీ మహాలక్ష్మి నిలయంలో..**

సకల విద్యలు, సంపదలు, సద్గుణాలను అందించే వరాల కల్పవల్లి వరలక్ష్మీ మాత అని మహిళా ప్రతినిధి గుండా రేవతి అన్నారు. స్థానిక 47వ వార్డులోని శ్రీ మహాలక్ష్మి నిలయంలో మహిళలంతా కలిసి వరలక్ష్మీవ్రతం నిర్వహించారు. ఈ సందర్భంగా వరలక్ష్మీ అమ్మవారిని సుందరంగా అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. లలితా సహస్రనామార్చన గావించి ముత్తయిదువులకు గాజులు, రవిక, పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గెల్లి శ్రీదేవి, బాలా త్రిపుర సుందరి, ప్రియాంక, తల్లాడ సావిత్రి, నూనె పద్మ, దీపిక, చిత్ర, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ హేమలత తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : అర్వపల్లిలోని భరద్వాజ ఆశ్రమం, కొమ్మాలలోని వేణుగోపాలస్వామి ఆలయాల్లో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాలను మహిళలు వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలకు భరద్వాజ ఆశ్రమంలో గాజులు, పండ్లు, రవికలు అందజేశారు. కార్యక్రమాల్లో అర్చకులు అర్వపల్లి రాంబాబుఅయ్యంగార్, పవన్‌కుమార్, దరూరి వెంకటాచార్యులు, అర్వపల్లి ధనలక్ష్మి, నవ్య, సాయికీర్తి, శైలజ, జయమ్మ, సదాలక్ష్మి, ముత్తమ్మ పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : శ్రావణమాసం రెండో శుక్రవారం మండల పరిధిలోని నాగులపహాడ్ ఆలయంలో వరలక్ష్మి వ్రతం వేడుకలను ఘనంగా నిర్వహించారు.

నూతనకల్ : శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా పలు గ్రామాల్లోని ఆలయాల్లో వరలక్ష్మి వ్రతాలను నిర్వహించారు. వేడుకల్లో సర్పంచ్ తీగల కరుణశ్రీగిరిధర్‌రెడ్డి, మహిళలు పాల్గొన్నారు.



పెన్‌పహాడ్ : నాగులపహాడ్‌లో వరలక్ష్మీ దేవికి పూజలు నిర్వహిస్తున్న మహిళలు



అర్వపల్లి : కొమ్మాలలోని వేణుగోపాలస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



నూతనకల్‌లో..



అర్వపల్లిలోని భరద్వాజ ఆశ్రమంలో..

## పిల్లల సంరక్షణపై అవగాహన

పెన్‌పహాడ్ : పెన్‌పహాడ్ మండల పరిధిలోని దూపహాడ్ గ్రామంలో తల్లులకు పిల్లల సంరక్షణపై కేవీకే విద్యార్థినులు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. శిశువులకు సరైన సమయంలో టీకాలు వేయించాలని, పిల్లలకు ఆరు నెలల వరకు తల్లి పాలే సురక్షితం అని అన్నారు. తల్లి పాలలో ఉండే పోషకాలు పసిపిల్లల ఎదుగుదలకు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. చిన్న పిల్లలకు సరైన నిద్ర అవసరమని అన్నారు. పిల్లలు ఆడుకునే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినులు భాగ్యశ్రీ, శ్రీశార్వాణి, మనోగ్నా, శ్వేత, దివ్య, వైష్ణవి, దీపికరెడ్డి, శివాని, పుష్ప, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ టికెట్‌కు దరఖాస్తులు



ఆర్డీఆర్ దరఖాస్తును అందిస్తున్న వేణారెడ్డి

భానుపురి : సూర్యాపేట అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా అవకాశం కల్పించాలని మాజీమంత్రి, పీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు రాంరెడ్డి దామోదర్ రెడ్డి శుక్రవారం గాంధీభవన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. దామోదర్‌రెడ్డి తరఫున పీసీసీ సభ్యులు కొప్పుల వేణారెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు రాంరెడ్డి కృష్ణారెడ్డిలు దరఖాస్తును సమర్పించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ అధికార ప్రతినిధి బాలలక్ష్మి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు నాగిరెడ్డి రవీందర్ రెడ్డి (కబడ్డీ) పాల్గొన్నారు.

సూర్యాపేట : తుంగతుర్తి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ టికెట్ ఇస్తే ప్రజల ఆశీర్వాదంతో విజయం సాధిస్తానని యువజన కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి మమత అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో దరఖాస్తు అందజేసి మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా కాంగ్రెస్ బలోపేతానికి క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నామని తెలిపారు.

## ఎస్సారెస్పీ కాలువకు బీఎన్‌రెడ్డి పేరు పెట్టాలి



సమావేశంలో పాల్గొన్న వామపక్ష నాయకులు

నాగారం : శ్రీరామ్ సాగర్ రెండవ దశ కాలువకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, ఎంసీపీఐయూ పొలిట్‌బ్యూరో సభ్యుడు భీంరెడ్డి నరసింహారెడ్డి పేరు పెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ శుక్రవారం వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో మండల పరిధిలోని ప్రగతినగర్ బీఎన్‌ఘాట్ వద్ద రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు వామపక్ష పార్టీల నాయకులు మాట్లాడారు. బీఎన్‌రెడ్డి తుంగతుర్తి, సూర్యాపేట నియోజకవర్గాలకు శ్రీరాంసాగర్ నీటిని తేవాలని కృషి చేశారని తెలిపారు. ఎంపీగా పార్లమెంట్‌లో పోరాడి 1996లో ప్రగతినగర్ వద్ద శ్రీరాంసాగర్ 2వ దశ కాలువలకు శంకుస్థాపన చేయించారని అన్నారు. కార్యక్రమంలో ఎంసీపీఐయూ కేంద్ర కమిటీ సభ్యుడు వరికుప్పల వెంకన్న, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పస్కుల మట్టయ్య, జిల్లా కార్యదర్శి ఎస్‌కె.నజీర్, పి.సైదమ్మ, సీపీఐ జిల్లా నాయకులు ఎల్లెంల యాదగిరి, సీపీఐ(ఎంఎల్) రామచంద్రన్ వర్గం రాష్ట్ర నాయకుడు బుద్ధా సత్యనారాయణ, ప్రజాపంథా నాయకులు పేర్ల నాగయ్య, ఎండీ రఫీ, నలుగురి రమేష్, లింగంపల్లి ఓంకార్, సట్టు నరసయ్య, మీసాల సైదులు, కాశీ పాల్గొన్నారు.

### పశువులకు టీకాలు

మద్దిరాల : రైతులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని జిల్లా పశువైద్యాధికారి(వీహెచ్ఏడీ) రవిప్రసాద్ అన్నారు. రెడ్డిగూడెంలో శుక్రవారం పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి అసిఫా, సర్పంచ్ బర్పటి ఉపేందర్, ఎంపీటీసీ నాగెల్లి శ్రీలత, శ్రవణ్‌కుమార్, గోపాల మిత్రలు లింగమూర్తి, శ్రవణ్ పాల్గొన్నారు.

అర్వపల్లి : ప్రభుత్వం ఉచితంగా అందించే గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను రైతులు తమ పశువులకు తప్పనిసరిగా వేయించాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ బి.అర్జున్ కోరారు. మండలంలోని వేల్పుచెర్లలో శుక్రవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో వీఎల్ఓ కేఎస్ఎస్ పద్మ, అటెండర్ యాదగిరి, యాకస్వామి, రైతులు పాల్గొన్నారు.

### తహసీల్దార్‌కు సన్మానం

మునగాల : మునగాల మండల నూతన తహసీల్దార్ ఆంజనేయులును శుక్రవారం ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఈఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి కత్తి వెంకటేశ్వర్లు మాట్లాడారు. మండలంలో నెలకొన్న దీర్ఘకాల సమస్యల పరిష్కారం కోసం కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఏపూరి రాజు మాదిగ, జిల్లా కార్యదర్శి కొత్తపల్లి అంజయ్య, మండల శాఖ అధ్యక్షుడు ఎల్.శ్రీనివాస్, ఎంఈఎఫ్ నాయకులు రెమిడాల లింగయ్య, కత్తి కోటయ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు శ్రీను, లచ్చయ్య పాల్గొన్నారు.

### హరితహారం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

నడిగూడెం : స్వాతంత్ర్య వజ్రోత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని అన్ని గ్రామాల్లో నిర్వహించబోయే మొక్కలు నాటే కార్యక్రమాన్ని (హరితహారం) విజయవంతం చేయాలని ఎంపీడీఓ యం.యర్రయ్య శుక్రవారం తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రభుత్వ సిబ్బంది పాల్గొనాలని ఆయన కోరారు.